## స్కూల్ బస్సు ఢీకొని మహిళ మృతి

సదాశివనగర్, డిసెంబర్ 5: స్కూల్ బస్సు ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్సై రాజు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బాపూర్ తండాకు చెందిన సివిబాయి(60), రతన్‌సింగ్ కలిసి బైక్‌పై ఉత్తునూరులోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లారు. అక్కడ వైద్యం చేయించుకొని తిరిగి ఇంటికి బయల్దేరారు. వజ్జపల్లితండా వెనుక నుంచి వస్తున్న ఉత్తునూర్‌లోని వాణి విద్యాలయం బస్సు బైకును ఢీకొన్నది. దీంతో బైకుపై వెనుకాల కూర్చున్న సివిబాయి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్సై కోనారెడ్డి

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 5: మండలంలోని వడ్లం గ్రామ శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారని ఎస్సై కోనారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పంట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారు. అందులోని కాపర్ వైరు, ఆయిల్‌ను చోరీ చేశారు. రైతు పడపాటి శివలింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పిట్లం, డిసెంబర్ 5: మండలంలోని గోద్మేగాం గ్రామశివారులోని పంట చేనులో మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు పిట్లం పోలీసులకు సమాచారం అందించగా.. ఇన్‌చార్జి ఎస్సై లింబాద్రి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వివరాల కోసం ఆరా తీస్తున్నామని, బాన్సువాడ రూరల్ సీఐ మురళి ఆధ్వర్యంలో విచారణ చేపడుతామని తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

## 'మిగ్‌జాం' ముసురు

గాంధారి/ తాడ్వాయి/ పిట్లం, డిసెంబర్ 5: మిగ్‌జాం తుపాను ప్రభావంతో మంగళవారం గాంధారి, తాడ్వాయి, పిట్లం తదితర మండలాల్లో ముసురు కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై, చల్లటి ఈదురు గాలులు వీయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాతావరణం ఒక్కసారిగా మారడంతో వారు ఇండ్ల నుంచి బయటికి రావడానికి భయపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడవకుండా కుప్పలపై టార్పాలిన్లు కప్పారు. తుపాన్ ప్రభావం ఇంకా ఉంటుందని వాతావరణ శాఖ తెలుపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## ఎల్లారెడ్డి ఏఎంసీ పాలకవర్గ సమావేశం



సమావేశంలో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

ఎల్లారెడ్డి, డిసెంబర్ 5: ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ పాలక వర్గ సాధారణ సమావేశం మంగళవారం ఏఎంసీ కార్యాలయంలో నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆగస్టు నుంచి అక్టోబర్ నెల వరకు సాధారణ ఖర్చుల వివరాలను కార్యదర్శి ధూమ్‌డా సభ్యులకు వివరించారు. పాలకవర్గం వాటిని ఆమోదించింది. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధిరాంరెడ్డి, డైరెక్టర్లు మల్లారెడ్డి, కిష్టయ్య, గూల విఠల్, ఫతీయొద్దీన్, వాహబుద్దీన్, కలాలి స్వరూప, హన్మంత్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్, దేశ్యానాయక్, ఎల్లారెడ్డి పీఏసీఎస్ చైర్మన్ ఏగుల నర్సింహులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నిజాంసాగర్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు



జ్యోతిబాపూలే పాఠశాలలో బాలికల హింసపై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ బాధ్యులు

నిజాంసాగర్, డిసెంబర్ 5: నిజాంసాగర్ ఏఎస్సై రాజేశ్వర్ ఆధ్వర్యంలో మండల కేంద్రం నిజాంసాగర్‌లో సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలు అడిగితే తెలియజేయవద్దని సూచించారు. తమ పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇస్తే తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే స్పందించవద్దని తెలిపారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు కొనసాగితే తమకు తెలియజేయాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసు సిబ్బంది శ్రీశైలం, హరిసింగ్, హరిబాబు, రేషన్ డీలర్ దేవేందర్‌రెడ్డి, గ్రామస్తులు పత్తి రమేశ్, అంజయ్య, విజయ్‌రావు పాల్గొన్నారు.

### బాలికల హింసపై అవగాహన..

సదాశివనగర్, డిసెంబర్ 5: బాలికలపై జరుగుతున్న హింసపై మండలంలోని కుప్రియాల్ గ్రామంలో ఉన్న జ్యోతి బాపూలే బాలికల పాఠశాల విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు రాజేందర్ రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం బాలికలు, మహిళలపై దాడులు పెరగడం ఆందోళన కలిగిస్తున్నదని అన్నారు. బాలికలపై హింస మానవ హక్కుల ఉల్లంఘనలో ఒకటన్నారు. ఆపద సమయంలో సహాయం కోసం 181, 1098 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాగిణి, జంగం మహేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి ఆలయంలో దీపోత్సవం

పిట్లం, డిసెంబర్ 5: మండలకేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని ఆలయ అర్చకుడు హన్మాండ్లుచారి ఆధ్వర్యంలో సామూహిక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని మహిళలు, స్వర్ణకార సంఘం, ఆలయ కమిటీ, మనుమయ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం దీపారాధన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌చారి, శ్రీధర్‌చారి, బాబుచారి, రమణయ్యాచారి, శంకర్‌చారి, నర్సింహులుచారి, అరవింద్‌చారి, నరేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.



దీపాలను వెలిగిస్తున్న మహిళలు

# అయ్యవారు మురళికి హరిదా ప్రతిభామూర్తి పురస్కారం



ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 5: తెలుగు పండిత్, కవి అయిన మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన అయ్యవారు మురళికి నిజామాబాద్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సరస్వతీరాజ్ –హరిదా ప్రతిభామూర్తి పురస్కారం ప్రదానం చేశారు. హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మురళికి ఈ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. మురళికి ఎల్లారెడ్డి జడ్పీహెచ్ పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హరిదా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపురం దేవేందర్, కాసర్ల నరేశ్, సంస్థ సభ్యులు తిరుమల ఆర్య, సంతోష్, దారం గంగాధర్, వడ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాన్ని అందుకుంటున్న అయ్యవారు మురళి

# పవిత్రమైనది అయ్యప్ప స్వామి మండల దీక్ష

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 5: ప్రస్తుత కాలంలో అయ్యప్ప స్వామి మండల దీక్ష అతి పవిత్రమైనదని గురుస్వామి చంద్రం అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో పలువురు భక్తులకు మండలదీక్షపై మంగళవారం అవగాహన కల్పించి మాలాధారణ చేశారు. ఎల్లారెడ్డి, సిర్గాపూర్ గ్రామానికి చెందిన భక్తులకు దీక్షలోని నియమాలు, మాలధారణ ఆవశ్యకత, ప్రాధాన్యత, శబరియాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి జంగం నీలకంఠం అప్ప, దీక్షాధారులు దేశబోయిన సాయిలు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వంగపల్లి కాశీనాథ్, పంతంగ రాజ్‌కుమార్, జక్కుల యాదగిరి, అవుసుల సంతోష్‌కుమార్, రాచకొండ సందీప్, అన్నా శివ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి మండల దీక్ష మాల వేస్తున్న గురుస్వామి



సదాశివనగర్‌లో భిక్ష చేస్తున్న మాలధారులు

### సదాశివనగర్‌లో నిత్యాన్నదానం

సదాశివనగర్, డిసెంబర్ 5: సదాశివనగర్‌లో ఉన్న అయ్యప్ప ఆలయంలో నిత్యాన్నదానం కొనసాగుతున్నది. మాలధారులు, భక్తుల కోసం ప్రతి రోజూ అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.గత సంవత్సరం కూడా ఉచిత అన్నదానం నిర్వహించామని, ఈ యేడాది కూడా దాతల సహకారంతో కొనసాగిస్తున్నామని ఆలయ నిర్వాహకుడు గురుస్వామి రాజు తెలిపారు. జనవరి 5వ తేదీ వరకు అన్నదానం కొనసాగుతుందని అన్నారు. మాలధారులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.